క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి ములగాడ 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్–2 ఈఈ డి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ పరిధిలోని కొత్తనక్క వానిపాలెం,పాతచెక్‌పోస్టుఏరియా, గాజువాక డిపో, శాంతిగిరికాలనీ, శ్రీనివాస్‌నగర్, గుల్లలపాలెం మార్కెట్ ఏరియా, శ్రీహరిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుటుందని ఆయన పేర్కొన్నారు.

పాన్‌షాప్ దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన పాన్‌షాప్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్నములగాడ సర్వీసు రోడ్డులోని ఓ పాన్ షాప్ మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. దీంతో షాపు యజమాని లబోదిబో మంది. వివరాలు.. చిన్నములగాడ ప్రాంతంలో నర్సమ్మ అనే మహిళ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. మంగళవారం షాప్ మూసివేసి బుధవారం ఉదయం 7 గంటలకు షాపు తెరిచేందుకు రాగా దగ్ధమై ఉండడంతో బోరున విలపించింది. ఈ ఘటనపై స్థానికుల సాయంతో గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో పోలీసుల గస్తీ ఎక్కువగా ఉండదని.. అందువల్లే ఆకతాయిలు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉండవచ్చునని ఆరోపిస్తున్నారు.

సీడీపీవో రమణకుమారికి సన్మానం


రమణకుమారిని సత్కరిస్తున్న అప్పారావు తదితరులు

విశాఖ విద్య: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు అధికారి ఎం.వి రమణకుమారిని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం ఘనంగా సత్కరించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టే అన్ని కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు చురుగ్గా పాల్గొంటున్నారని అభినందినించారు. కార్యక్రమంలో గురుకులాల జిల్లా కన్వీనర్ రూపవతి, సీడబ్ల్యూసీ జిల్లా చైర్ పర్సన్ రాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

భక్తిశ్రద్ధలతో శ్యామా నవరాత్రి ఉత్సవాలు

నల్పువరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం రాజశ్యామల అమ్మవారు దమనోత్సవ దివ్యాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా భార్యాభర్తల మధ్య సఖ్యత,దాంపత్య సుఖం,ఆరోగ్యం లభిస్తాయని భక్తుల విశ్వాసం.అలాగే వసంత పంచమి కావడంతో గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం శ్యామా అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. చిన్నారులతో వాగ్దేవి హోమం జరిపించారు.



మురిసిన తొలి బడి

- చూడచక్కగా అంగన్‌వాడీ కేంద్రాలు
- ఆటపాటలతో విద్యా బోధన
- చిన్నారులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు
- గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం


62వ వార్డు త్రినాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తింటున్న చిన్నారులు

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. కార్పొరేట్ ప్లే స్కూళ్లను మించేలా ప్రీ స్కూళ్లుగా అవి రూపాంతరం చెందాయి. చిన్నారులను ఆకట్టుకునేలా విద్యా బోధనలో మార్పులు తీసుకొచ్చారు. ఆటపాటలతో కూడిన విద్యను పిల్లలకు అందిస్తున్నారు. పాఠ్యాంశాలు, నీతి కథల బోధనతోపాటు క్రమశిక్షణను నేర్పిస్తున్నారు. అన్ని సదుపాయాలు కల్పించి చిన్నారుల సరదా లోకంగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దారు.

అందరికీ పౌష్టికాహారం

పారిశ్రామిక ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచారు. చిన్నారి విద్యార్థులకు అందుతున్న బోధన, పౌష్టికాహారంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల వివరాలు

జీవీఎంసీ 40వ వార్డులో 2, 58వ వార్డులో 5, 50వ వార్డులో 5, 60వ వార్డులో 3, 61వ వార్డులో 1, 62వ వార్డులో 7, 63వ వార్డులో 4 చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ పిల్లలకు నిత్యం విద్యా బోధనతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతోంది. నెలలో రెండు సార్లు చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలకు డ్రై రేషన్(పౌష్టికాహారం) పంపిణీ చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న భోజనం మెనూ

సోమవారం	అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర, 200 ఎంఎల్ పాలు
మంగళవారం	పులిహోర, టామోటా పప్పు, ఉడికించిన గుడ్డు, పాలు
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, పాలు
గురువారం	అన్నం, ఆకుకూర, సాంబార్, ఉడికించిన గుడ్డు, పాలు
శుక్రవారం	అన్నం, బీరకాయ లేదా సొరకాయ పప్పు, మునగాకు కూరతో ఉడికించిన గుడ్డు, పాలు
శనివారం	వెజిటెబుల్ రైస్, ఆకుకూర, కూరగాయాలతో సాంబార్, ఉడికించిన గుడ్డు, పాలు


61వ వార్డు మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్


మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆహ్లాదకర వాతావరణంలో చదువులు



తమ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారికి వ్యక్తిగత శ్రద్ధతో చదువు చెబుతున్నాం. పిల్లలకు తల్లుల సమక్షంలో మంచి భోజనం, తాగునీరు నిత్యం అందిస్తున్నాం. ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులకు చదువుతోపాటు నీతి కథలు బోధించి ఆటలు ఆడిస్తుంటాం.

–డి.సునీత, అంగన్‌వాడీ టీచర్, మల్కాపురం

చక్కగా చూసుకుంటున్నారు



మా కుమారుడిని మల్కాపురం అంగన్‌వాడీ సెంటర్‌కు పంపిస్తున్నాం. చదువుతోపాటు ఆటలు ఆడిస్తూ చక్కగా బోధిస్తున్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇస్తున్నారు. తమ లాంటి వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి సౌకర్యం కల్పించింది. –బి.భవాని, చిన్నారి తల్లి, మల్కాపురం

పౌష్టికాహారం ఇస్తున్నారు



నా మనవడు, నా కూతురి(గర్భిణి)కి మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోంది. పిల్లలకు నాణ్యమైన చదువు, భోజనం అందించడమే కాకుండా గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని ఇవ్వడం అభినందనీయం.

– పి.లక్ష్మి, మల్కాపురం

పైడిమాంబ ఉత్సవ సందడి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో పైడిమాంబ అమ్మవారి జాతర సందడి బుధవారం కూడా కొనసాగింది. ఈ నెల 20న మంగళవారం మారు ఉత్సవం జరగనున్న నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. అమ్మవారి మూలమూర్తులను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ వస్తువులను కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. రంగులరాట్నం తిరిగేందుకు చిన్నారులు పోటీపడ్డారు. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను , సోమినాయుడు, చుక్కా ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

హుండీ ఆదాయం లెక్కింపు

ఉత్సవ రోజు అమ్మవారికి వచ్చిన కానుకలను దేవాదాయ శాఖ, ఆలయ ట్రస్టీ సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.1.30 లక్షలు, ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.47 వేలు వచ్చినట్లు ఆలయ ట్రస్టీ పైడి ప్రకాశ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈవో మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నీలాపు సర్వేశ్వర రెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ


పూజలందుకున్న సత్తెమ్మతల్లి


అమ్మవారి తొలి మండపం వద్ద చీరలు సమర్పిస్తున్న మహిళలు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు సత్తివానిపాలెం సత్తెమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారి ఆది మండపం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఒమ్మి కుంచుబాబు ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాల నాయుడు, గంధం శ్రీను, శ్రీనువాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్పందించారు.. పరిష్కరించారు


గత నెలలో కూలిన గెడ్డ రక్షణ గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్(ఫైల్)


ఈ నెల తొలి వారం నాటికి గెడ్డ వద్ద పునర్నిర్మించిన రక్షణ గోడ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు వుడా కాలనీ ఎంఐజీ ప్రాంతంలోని గెడ్డ రక్షణ గోడ గత నెలలో కూలింది. మురుగు గెడ్డలో నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను కార్పొరేటర్ పి.వి.సురేష్ ద్వారా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిశీలించారు. వెంటనే అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన కూలిన గోడ స్థానంలో కొత్తది పునర్నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.13 లక్షల జీవీఎంసీ నిధులతో రక్షణ గోడ పునర్నిర్మాణ పనులను జీవీఎంసీ వర్క్స్ అధికారులు చేపట్టారు. సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ పి.వి.సురేష్‌లకు సమస్య చెప్పిన నెల రోజుల్లోనే గెడ్డ రక్షణ గోడ నిర్మించేలా చర్యలు చేపట్టారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు నిండి, 45 సంవత్సరాల లోపు, ఇంటర్ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చదువులమ్మకు వందనం


ఉక్కు త్రిశక్తి దేవాలయంలో సరస్వతి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

- వసంతి పంచమి వేళ విద్యార్థుల పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు


త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి

ఉక్కునగరం: వసంతి పంచమి వేళ అమ్మవారి సన్నిధి విద్యార్థులు, చిన్నారులతో కళకళలాడింది. చదువులమ్మకు ప్రత్యేక పూజలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక, విద్యా సౌరభాలు వెదజల్లింది. సరస్వతీ దేవి జన్మించిన శుభతిథిగా భావించే శ్రీ పంచమిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయంలో బుధవారం సరస్వతీ పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు ఫణి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల్లో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలతో సహా హాజరయ్యారు. సాయంత్రం సరస్వతీ దేవికి సహస్ర నాగవల్లి పత్ర సహిత శ్వేత పుష్పార్చన చేశారు. అనంతరం బాలబాలికలతో సామూహిక సరస్వతీ పూజ చేయించారు.

- హనుమాన్ దేవాలయంలో

ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో పుష్పాంజలి పూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాసాల్లో పలువురు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి మహా హారతి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న గంట్యాడ వెంకాయమ్మ పరస


పరస పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెదగంట్యాడ: గంట్యాడ వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16న పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద పరస నిర్వహించనున్నామని ట్రస్ట్ అధినేత గంట్యాడ గోవిందరాజు తెలిపారు. పరస పోస్టర్‌ను ఎస్సీ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరస జరుగుతుందని గోవిందరాజు తెలిపారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, కాకినాడ పెంటారావు, గంట్యాడ పైడికొండ, ఎస్.రాజారావు, వెంకటేష్, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సందేశాత్మకం


ప్రసంగిస్తున్న చిన సూర్యనారాయణ

సీతమ్మధార: వాలెంటైన్స్ డే సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రామకథ–ప్రేమసుధ అనే అంశంపై సాహితీవేత్త సిహెచ్.చినసూర్యనారాయణ ప్రసంగించారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కె.జి.వేణు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేమ మానవ జీవితంలో ముఖ్య భూమిక పోషిస్తూ మానవ విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. ఈ ప్రేమ ఘట్టాలు రామాయణంలో ఎక్కువగా కనిపించి, సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. రామాయణంలో తండ్రీకొడుకుల ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, స్నేహితుల ప్రేమ, ప్రజలు–ప్రభువు ప్రేమ ఆయా పాత్రల్లో మనకు కనిపిస్తుంటాయన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డి.వి. సూర్యారావు, కొత్తూరు రమణ, కె.భీమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకుల మెస్ పరిశీలన


మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, కిచెన్ పరిశీలించారు. హాస్టల్ మెస్‌లో సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం విద్యార్థుల భోజన సదుపాయాలు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు వున్నారు.

భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన హనుమద్వైభవ ప్రవచనాలు


కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్


హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

వెంకన్న సన్నిధిలో డిప్యూటీ మేయర్ పూజలు


వెంకన్న సన్నిధిలో పూజలు చేస్తున్న జియ్యాని శ్రీధర్

పెందుర్తి: వెంకటాద్రిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం సందర్శించారు. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వెంకటాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈవో నీలిమ, ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు


గోపాలపట్నం బంకు జంక్షన్‌లో కురుస్తున్న పొగమంచు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రాంతంలో బుధవారం పొగ మంచు కమ్మేసింది. ఉదయం నుంచి దట్టంగా మంచు కురవడంతో స్థానికులు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అనుభూతి పొందారు. ఈ మంచు 9 గంటల వరకు వీడలేదు.

కమనీయం.. అప్పన్న కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.